

98.36 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

విజయనగరం (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 1: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం ఒక్కరోజే 98.36 శాతం పూర్తిచేసి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచినట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,78,240 మంది పింఛనుదారులు ఉండగా మొదటిరోజే 2,73,673 మందికి పింఛన్ సొమ్ము అందించినట్లు చెప్పారు. రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపిన డీఆర్‌డీఏ, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బందిని కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి అభినందించారు.

జై పైడిమాంబ

- ముర్రాటలు సమర్పించిన భక్తులు
- నగరంలో పండగ శోభ


ముర్రాటలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విజయనగరం రూరల్, అక్టోబరు 1

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడిమాంబకు భక్తులు మంగళవారం ముర్రాటలు సమర్పించారు. ప్రతి ఏటా సిరిమానోత్సవానికి ముందు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ముర్రాటలతో ఆలయానికి వెళ్లి పైడిమాంబకు చల్లదనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా భక్తులు పసుపు, కుంకుమ, ఇతర సుగంధ ద్రవ్యాలతో కూడిన ముర్రాటలను తలపై పెట్టుకొని జై పైడిమాంబ అంటూ ముందుకు సాగారు. కొత్తపేట, యాదవవీధి, ఇప్పిలివీధి, కొత్తగవరవీధి, గాజులవీధి, లంకాపట్టణం, జొన్నగుడ్డి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు ముర్రాటలతో వెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు. థాసా డప్పులు, సాము, గరిడీలు, పులివేషాలు, శక్తివేషాలు అలరించాయి. దీంతో నగరంలో పండగ శోభ నెలకొంది. మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి వద్ద పైడిమాంబకు పుష్పాలంకరణ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఇక ప్రైవేట్ మద్యం దుకాణాలు



- నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 11న లాటరీ ద్వారా ఎంపిక
- 12 నుంచి అందుబాటులోకి..
- ఉమ్మడి జిల్లాలో 223 షాపులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 1: గత వైసీపీ సర్కారు తీసుకొచ్చిన ప్రభుత్వ మద్యం దుకాణాల విధానాన్ని రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వాటి స్థానంలో ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 9 వరకూ ఆన్‌లైన్‌లో గానీ.. ఆఫ్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో షాపునకు రూ.2 లక్షలు నాన్ రిఫండబుల్‌గా డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 11న లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. 12 నుంచి కొత్త మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. వాస్తవానికి జగన్ సర్కారు ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలకు గత నెల 30తోనే గడువు ముగిసింది. కానీ, ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటుచేసే వరకూ ప్రభుత్వ షాపులు కొనసాగనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 223 దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో విజయనగరం జిల్లాకు 165 (ప్రైవేట్ వ్యక్తులకు 149, గీత కార్మికులకు 16), పార్వతీపురం మన్యం జిల్లాకు 58 (ప్రైవేట్ వ్యక్తులకు 53, గీత కార్మికులకు 5) షాపులను కేటాయించనున్నారు.

పాత ప్రీమియం బ్రాండ్లు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పాత ప్రీమియం బ్రాండ్ మద్యం అందుబాటులోకి తెస్తామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే అధికారంలోకి వచ్చిన తరువాత కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆరు రాష్ట్రాల్లో మద్యం పాలసీలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీంతో వివిధ రాష్ట్రాల్లో ధరలకు అనుగుణంగా ఏపీలో చీప్ లిక్కర్ క్వార్టర్ ధరను రూ.99గా నిర్ణయించారు. గతంలో ఉండే ప్రీమియం బ్రాండ్ల మద్యాన్ని అప్పటి ధరకు అటుఇటుగా అందించనున్నారు. జనాభా ప్రాతిపదికన 4 శ్లాబుల్లో లైసెన్స్‌దారుల నుంచి డిపాజిట్లను వసూలు చేయనున్నారు. పదివేల జనాభా లోపు రూ.5 లక్షలు, 50 వేల లోపు రూ.50 లక్షలు, 50 వేలు దాటి లక్షలోపు జనాభా ఉంటే రూ.65 లక్షలు, లక్ష దాటి జనాభా ఉంటే రూ.85 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.

షాపులు దక్కించుకునేందుకు పోటీ..

ప్రైవేట్ మద్యం షాపులు దక్కించుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు, వ్యాపారులు పోటీ పడుతున్నారు. భారీ స్థాయిలో దరఖాస్తులు చేయాలని భావిస్తున్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవడానికి వెసులుబాటు ఉండడంతో చాలా మంది ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. గతంలో ఈ వ్యాపారంలో అనుభవం ఉన్నవారు తమ అనుచరులు, బినామీలు, బంధువుల పేరుతో దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఏ రాష్ట్రానికి చెందిన వారైనా దరఖాస్తు చేసుకో వచ్చని ప్రభుత్వం చెప్పడంతో కొందరు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన తమ బంధువులను కూడా రంగంలోకి దించుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని షాపులను దక్కించుకోవడంపై ఎక్కువగా దృష్టిపెట్టారు.

షాపుల్లో నో స్టాక్..


నెల్లిమర్ల బాట్లింగ్ యూనిట్ డిపో నుంచి గత నెల 18 నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరుకు సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రస్తుతం ఏ షాపు ముందు చూసినా నో స్టాక్ బోర్డు కనిపిస్తోంది. కేవలం చీప్ లిక్కర్ మాత్రమే లభిస్తోంది. ఇదే అదునుగా బార్లలో మద్యం ధరలను అమాంతం పెంచేశారు. రూ.220కు అమ్మాల్సిన బీరును రూ.300కుపైగా విక్రయిస్తున్నారు. ఈ నెల 12 వరకూ తమకు ఈ కష్టాలు తప్పవని మందుబాబులు నిట్టూరుస్తున్నారు.

12 నుంచి కొత్త మద్యం పాలసీ..

- ఎక్సైజ్, ప్రొహిబిషన్ డీసీ బాబ్జీరావు



విజయనగరం క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ ఈ నెల 12 నుంచి అమల్లోకి వస్తుందని ఎక్సైజ్, ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు అన్నారు. మంగళవారం స్థానిక బ్యాంకు కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ మద్యం దుకాణాల కోసం ఈ నెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలని, 11న కలెక్టర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. షాపు లైసెన్సు ఫీజులను ప్రతి రెండు నెలలకు ఒకసారి ఆరు విడతలుగా చెల్లించాలని చెప్పారు. ఈ సమావేశంలో టౌన్ సీఐ మన్మథరావు పాల్గొన్నారు.


గాంధీ బస చేసిన అశోక్ బంగ్లా

మహాత్ముడు వచ్చే.. విజయనగరం పులకించే..

అది 1921 మార్చి 30. స్వాతంత్ర్య ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న వేళ. సరిగ్గా అప్పుడే బరంపురం నుంచి విజయవాడ వెళ్తున్న రైలు విజయనగరం స్టేషన్‌లో వచ్చి ఆగింది. అప్పటికే ఆ ప్రాంతం జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన వేలాది మంది ప్రజలతో కిక్కిరిసిపోయి ఉంది. అందరూ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఓ వ్యక్తి రైలు నుంచి దిగారు. అంతే నేల తల్లి పులకించింది. ఆ ప్రాంతం ప్రజల ఈలలు, చప్పట్లతో మార్మోగింది. ఆ రైలు నుంచి దిగింది మరెవరో కాదు. మహాత్మా గాంధీ. స్వాతంత్రోద్యమంలో భాగంగా భరత జాతిని జాగ్రతం చేసేందుకు తొలిసారి ఆయన విజయనగరం గడ్డపై అడుగుపెట్టారు. ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాల్లో జిల్లా ప్రజలను భాగస్వామ్యం చేసి సముచిత స్థానం కల్పించారు. నేడు గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

- జిల్లాకు మూడుసార్లు రాక
- అశోక్ బంగ్లాలో బస
- నేడు బాపూజీ జయంతి

విజయనగరం (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 1

మహాత్మా గాంధీకి జిల్లా కేంద్రం విజయనగరంతో ఎంతో అనుబంధం ఉంది. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ప్రజలను చైతన్య పరిచేందుకు ఆయన ఇక్కడకు మూడుసార్లు విచ్చేశారు. 1920 నాటికి సాత్వంత్ర్యోద్యమం ఉధృతం అయింది. భరత జాతిని జాగ్రతం చేసేందుకు గాంధీ దేశ పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా 1921 మార్చి 30న గాంధీజి మొదటసారి విజయనగరంలో అడుగుపెట్టారు. బరంపురం నుంచి విజయవాడకు రైలులో వెళ్తూ మార్గమధ్యలోని విజయనగరం స్టేషన్‌లో దిగారు. ఆయనను చూసేందుకు మహిళలు, దేశ భక్తులు పోటీ పడ్డారు. ఆ రోజుల్లోనే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుమారు 10వేల మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. ● రెండో పర్యాయం 1929 ఏప్రిల్ 30న గాంధీజి నగరానికి వచ్చారు. విశాఖపట్నం నుంచి దేశభక్తుడు వెంకటప్పయ్య పంతులు ఆయన్ను జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. స్థానిక బ్యాంక్ మైదానంలో స్వాతంత్ర్య పోరాటంపై సమావేశం నిర్వహించారు. విదేశీ వస్త్రాలను బహిష్కరించా లని, నూలు వస్త్రాలు వినియోగించాలని ప్రజలకు గాంధీజి పిలుపునిచ్చారు. ఖద్దర్ వస్త్రాల తయారీ ద్వారా స్థానికంగా లభించే ఉపాధి గురించి తెలియజేశారు. ● మూడోసారి 1933 డిసెంబరు 28, 29 తేదీల్లో రెండురోజుల పాటు విజయనగరంలో పర్యటించారు. అప్పట్లో 5వ నెంబరు బంగ్లాగా పిలవబడే ప్రస్తుత అశోక్ బంగ్లాలో ఆయన బస చేశారు. గంటస్తంభం మీదుగా వెళ్లి ప్రకాశం పార్కులో జరిగిన భారీ బహిరంగా సభలో పాల్గొన్నారు. ముందుగా దళితవాడలో పర్యటించారు. అంటరానితనం రూపుమాపేందుకు ఆలయాల్లో వారికి ప్రవేశం కల్పిస్తున్నట్లు స్థానికులు గాంధీజికి వివరించారు. నగరంలో ఉప్పు సత్యాగ్రహ దీక్ష చేస్తున్నట్లు దేశభక్తులు చెప్పారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. 'నేను మీకు సుపరిచితుడినే. ఇక్కడకు ఇది మూడో పర్యాయం వచ్చాను. హరిజనోద్యమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. నూలు వస్త్రాలు ధరించాలని' ఆయన కోరారు.

పోరాటానికి విరాళాల వెల్లువ..

స్వాతంత్ర్య పోరాటం చేస్తున్న గాంధీజికి జిల్లా ప్రజలు మద్దతు పలికారు. అంతేకాకుండా ఉద్యమాన్ని ముందుకు నడిపించేందుకు భారీగా విరాళాలను అందచేశారు. మహారాజులు, జమీందార్‌లే కాకుండా మధ్యతరగతి ప్రజానీకం విరివిగా విరాళాలు అందించారు. ఆదే గోపాలమ్మ అనే బాలిక తన వంటిపై ఉన్న బంగారు ఆభరణాలను సైతం గాంధీజికి అందచేసింది ఆయన పేరుతో నగరంలో పార్కు కూడా నిర్మించారు. అదే విధంగా అశోక్ బంగ్లాలో ఆయన జ్ఞాపకాల నిమిత్తం గాంధీజీ రాట్నాం తిప్పుతున్న ఫొటోను గుర్తుగా ఉంచారు.


ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న ఏఎస్పీ సౌమ్యలత

ఏఎస్పీగా సౌమ్యలత

విజయనగరం క్రైం, అక్టోబరు 1: జిల్లా అదనపు ఎస్పీగా సౌమ్యలత మంగళవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈమె ఏసీబీలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. డైరక్టు డీఎస్పీగా ఎంపికైన సౌమ్యలత గతంలో బొబ్బిలి, ఇంటిలిజెన్స్, ఏసీబీ తదితర విభాగాల్లో సమర్థ వంతంగా పనిచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా ఆమె కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయ పనితీరును పర్యవేక్షించాలని, రాష్ట్ర డీజీపీ కార్యాలయం, రేంజ్ పోలీసు కార్యాలయాలతో జరపాల్సిన ఉత్తర, ప్రత్యుత్తరాల్లో ఎటువంటి కాలయాపన ఉండకూడదని ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సౌమ్యలతకు డీఎస్పీలు శ్రీనివాసరావు, వీరకుమార్, సీఐలు, ఆర్ఎస్ఐలు పలువురు పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సాంస్కృతిక వైభవం చాటిచెప్పేలా

విజయనగరం ఉత్సవాలు

- ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి
- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం (ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రూరల్: జిల్లా సాంస్కృతిక వైభవం చాటిచెప్పేలా విజయనగరం ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం ఉత్సవాలు, పైడిమాంబ సిరిమానోత్సవానికి సంబంధించిన వేదికలను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. సిరిమాను తిరిగే ప్రధాన రహదారి, విజయనగరం కోట, మెగా ఈవెంట్ జరిగే కార్యక్రమాలు జరిగే ఆయోధ్య మైదానం, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసే మాన్సాస్ గ్రౌండ్, క్రీడాపోటీలు నిర్వహించే విజ్జీ స్టేడియాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే అదితి మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఆర్వో అనిత, సీపీవో బాలాజీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, ఆర్డీవో కీర్తి, పైడిమాంబ దేవస్థానం ఈవో ప్రసాద్‌రావు, పూజారి బంటుపల్లి వెంకటరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్


పార్టీలో చేరిన వారితో మంత్రి సంధ్యారాణి

టీడీపీలో భారీగా చేరికలు

- మంత్రి సంధ్యారాణి సమక్షంలో చేరిన 110 కుటుంబాలు

మెంటాడ, అక్టోబరు 1: తెలుగుదేశం పార్టీలో మంగళవారం వైసీపీ నుంచి భారీగా చేరికలు జరిగాయి. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమక్షంలో మెంటాడ మండలం లోతుగెడ్డ సర్పంచ్ సారా భీమారావు, వార్డు మెంబర్లు లకాయి కొండమ్మ, అంటిపర్తి అప్పలరాము, రొంగలి బుచ్చిదొర, తూపుడు పోలమ్మతో పాటు సుమారు 110 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమష్టి కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యమని, మంత్రిగా తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. గిరిజనులు ఎంతో నమ్మకంతో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన తనను సర్పంచ్‌గా గెలిపించారని, అయినా వారికి ఏమీ చేయలేకపోయానని సర్పంచ్ భీమారావు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తనకు అడుగడుగునా అవమానాలే ఎదురయ్యాయని అన్నారు. ఉప ముఖ్యమంత్రిగా రాజన్నదొర ఉండి కూడా తమ సమస్యలు పట్టించుకోలేదని, అందుకే పార్టీ వీడినట్లు సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మట్కాకు ముహూర్తం కుదిరింది



వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న 'మట్కా' చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. 1958-82 మధ్య కాలంలో జరిగే పీరియాడికల్ మూవీ ఇది. ఇందులో వరుణ్ నాలుగు విభిన్న గెటప్స్‌తో కనిపిస్తారు. ప్రస్తుతం కీలకమైన యాక్షన్ ఎపిసోడ్‌ను దర్శకుడు కరుణకుమార్ చిత్రీకరిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంతో జరుగుతోందనీ, నవంబర్ 14న సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాతలు డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి చెప్పారు. రిలీజ్ డేట్‌ను వెల్లడిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లు దిగి వస్తున్న వరుణ్‌తేజ్ రెట్రో గెటప్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లు.

'శ్వాగ్' ఒక వంశానికి సంబంధించిన కథ మాత్రమే కాదు పితృస్వామ్యం అనే క్లాష్ నుంచి 15వ శతాబ్దంలో మొదలయ్యే కథ కూడా. స్త్రీ, పురుషుల్లో ఎవరు గొప్ప అనే అంశంపై చర్చించే ఆసక్తికరమైన కథ. కొత్త కథలు ఎప్పుడు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేశాం' అన్నారు శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం ఈ నెల నాలుగున విడుదలవుతున్న నేపథ్యంలో మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

మేకప్ కోసం నాలుగున్నర గంటలు



- నేనెప్పుడూ డ్యూయెల్ రోల్స్ వేయలేదు. కానీ ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. అందరూ ఒకే పోలికలతో ఉండే ఒకే వంశస్థులు. ఎలా చేయాలన్నది సవాల్‌గా అనిపించింది. గెటప్స్ అన్నీ సెట్ అయ్యాక నమ్మకం కుదిరింది.. ఈ నాలుగు పాత్రల్లో సింగ పాత్ర కొంచెం ఈజీ అనిపించింది. మిగతా మూడూ కష్టమైనవే. రోజూ నాలుగున్నర గంటల సేపు మేకప్ చేసుకోవడం, దాన్ని తీయడానికి మరో రెండు గంటలు పట్టడం.. చాలా టఫ్. అయితే టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ చూసిన తర్వాత ఆ కష్టాన్ని మరిచిపోయా.
- చాలా పెద్ద కథ ఇది. దీన్ని రెండున్నర గంటల్లో చెప్పారా అని సినిమా చూశాక ప్రేక్షకులు దర్శకుడు హసిత్ గోలిని అభినందిస్తారు. కథలో భాగంగానే ఉండే వినోదం అందరినీ అలరిస్తుంది. నా కెరీర్‌లో వన్ ఆఫ్ ద టాప్ ఫిల్మ్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది.
- సినిమాలో క్యారెక్టర్ బ్యాక్ స్టోరీస్ బాగా కుదిరాయి. రీతూ వర్మ పాత్రలో మంచి ట్రాన్స్‌ఫర్మేషన్ ఉంటుంది. ఈ సినిమా చూశాక మహిళల్ని ఎక్కువ అభిమానిస్తాం. గౌరవిస్తాం.
- ఒక థ్రిల్లర్ చేస్తున్నాను. అలాగే గీతా ఆర్ట్స్‌లో ఓ మంచి ఎంటర్‌టైనర్ చేస్తున్నాను.

గోవిందాకు బుల్లెట్ గాయం



ప్రమాదవశాత్తు తుపాకి పేలిన ఘటనలో బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా గాయపడ్డారు. ఆయన కాలులోకి బుల్లెట్ దూసుకుపోయింది. కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు సర్జరీ చేసి ఆ బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం ముంబై జుహూలోని గోవిందా నివాసంలో ఈ ఘటన జరిగింది. ఆయన లైసెన్స్ రివాల్వర్ చేతిలో నుంచి జారి కిందపడి హఠాత్తుగా పేలింది.


జీబ్రా అందరికీ నచ్చుతుంది



సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ నటిస్తున్న 'జీబ్రా' చిత్రం టీజర్‌ను హీరో నాని విడుదల చేశారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, పద్మజ, బాలసుందరం, దినేశ్ సుందరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్ విడుదల కార్యక్రమానికి అతిథిగా వచ్చిన మంచు మనోజ్ మాట్లాడుతూ 'టీజర్ అదిరిపోయింది. ఈ చిత్ర నిర్మాత ఎస్నెస్ రెడ్డి నా శ్రేయోభిలాషి. బాగా ఖర్చుపెట్టి సినిమా తీశారు. నా అభిమాన నటుడు సత్యదేవ్. ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ 'ఓ కొత్త క్యారెక్టర్‌తో వస్తున్నా. అన్ని పరిశ్రమల్లోని ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ఇందులో ఉన్నారు. ప్రతి వ్యక్తికి ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు.

రజనీకి తీవ్ర అస్వస్థత

- రక్తనాళంలో వాపు
- స్టెంట్ వేసిన వైద్య బృందం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. సోమవారం అర్ధరాత్రి ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు ఆయన్ని గ్రీమ్స్‌రోడ్డులో వున్న అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. రజనీ అనారోగ్యం గురించి తెలియగానే ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా వుందని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని మంగళవారం ఆసుపత్రివర్గాలు ప్రకటించాయి. 'గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళం (బృహద్ధమని)లో వాపు వచ్చింది. దీనికి శస్త్రచికిత్స చేయకుండా ట్రాన్స్‌కాథెటర్ విధానం ద్వారా చికిత్స చేయడం జరిగింది. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీష్ సారథ్యంలోని వైద్య బృందం స్టెంట్ వేసి, వాపును సరిచేశారు. ఎండోవాస్కులర్ రిపేర్ ప్రణాళికాబద్ధంగా సాగిందని ఆయన శ్రేయోభిలాషులకు, అభిమానులకు తెలియజేయాలనుకుంటున్నాం. రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి ఇంటికి వెళతారు' అని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులిటెన్‌లో పేర్కొన్నాయి. ఇదిలా వుండగా రజనీ త్వరగా కోలుకోవాలంటూ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు ఆకాంక్షించారు. తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం స్వయంగా ఆసుపత్రికి వెళ్లి రజనీ ఆరోగ్యంపై వాకబు చేశారు. రజనీ క్షేమంగా వున్నారని, కోలుకుంటున్నారని మంత్రి ప్రకటించారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నేడు గాంధీ జయంతి

కలెక్టరేట్: మహాత్మాగాంధీ జయంతి వేడుకలు జిల్లా, మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాల యాల్లో నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. కలె క్టరేట్‌లో ఆడిటోరియంలో ఉదయం 8.30కు జయంత్యు త్స వాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో మంగళ వారం తెలిపారు.

'విజిలెన్స్' సభ్యుల నియామకానికి దరఖాస్తులు

సీతంపేట రూరల్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీలో సభ్యులుగా చేరడానికి ఐదుగురు అభ్యర్థులు అవసరం కాగా, బీసీ వర్గాలకు చెందిన ముగ్గురి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిఉన్న అభ్యర్థులు శ్రీకాకుళం జిల్లా షెడ్యూల్డ్ కులాల, సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో అక్టోబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈశ్రమ్‌పై అవగాహన

శృంగవరపుకోట: ఎస్.కోట శివారు సీతంపేట గ్రా మంలో ఉన్న భవన నిర్మాణ కార్మి కులకు ఈశ్రమ్ కార్య క్రమంపై ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు సూ ర్యారావు మంగళవారం అవగాహన కల్పించారు. లేబర్ అధికారి కిరణ్ చంద్రతో కలిసి తాపీ మేస్త్రీల సంఘం వారికి ఈపథకం వల్ల ప్రయోజనాలు వివరించారు.

అశోక్‌ను కలిసిన అవనాపు దంపతులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): కేంద్రమాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజులను అవనాపు విక్రమ్, భావన దంపతులు మంగళవారం బంగ్లాలో మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఇటీవల జనసేనలో చేరిన అవనాపు దంపతులు కూటమిలో మిత్రపక్షమైన అశోక్ గజప తిరా జు, అదితి గజపతిరాజులను కలిసి శాలువాతో సత్క రించి పూలమొక్కను అందించారు. కాళ్ల గౌరీశంకర్, సంపత్ ఈశ్వరరాజు, నర్సింగరావు, అప్పలనాయుడు, మారేష్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

భాను మాస్టార్‌కు తృతీయ బహుమతి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచరు గుంట్రెడ్డి భాస్కరరావు (భాను మాస్టారు) కార్టూన్‌కు జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ బహుమతి లభించింది. ఈ మేరకు అమరావతికి చెందిన భారతీయ జ్యోతి ట్రా స్టు విజ్ఞానసంస్థ నిర్వహించిన జాతీయ కార్టూన్ పోటీ లో భాను గీసిన కార్టూన్ ఎంపికైంది. ఈనెల 28న తెలం గాణలోని బొగ్గులకుంటలో జరిగే కార్యక్రమంలో బహు మతిని అందజేస్తారని ఆయన తెలిపారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొబ్బిలి రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త కల్పన హెచ్చరించారు. మంగళవారం బొబ్బిలిలోని భవిత ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులు ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేసేలా బో ధించాలన్నారు. ఐఈఆర్పీ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయం

విజయనగరం దాసన్నపేట: సనాతన ధర్మ పరి రక్షణకు ఐక్యంగా కదులుదామని జనసేన నాయకులు గురాన అయ్యలు, అవనాపు విక్రమ్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ కాళ్ల గౌరీశంకర్ పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రాయచిత్త దీక్షకు సంఘీభావంగా మన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో మంత్రపఠనం చేసి 108 కొబ్బరికాయలు కొట్టారు. రవీంద్ర, సతీష్, అశ్విని, జ్యోతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విజయనగరం టౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించుకోవచ్చని విజయన గరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విజయనగరం శివారు విజ్జీ క్రీడా మైదానంలో మంగళవారం ఉదయం పరిస రాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా క్రీడా మైదానంలో అధికారులు, క్రీడాకారులు, వాకర్స్‌తోపాటు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్, క్రీడాశాఖ అధికారులు, టీడీపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును నిర్వహించాలి

రాజాం/రూరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రారంభించి సమర్థవంతంగా అమలుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కార్మికశాఖ కార్యాలయం వరకుభవన నిర్మాణ కార్మి కులు, సంఘం, సీఐటీయూ నాయకులు ప్రదర్శన నిర్వ హించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సహాయ కార్మిక అధికారి కొండలరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీ యూ నాయకులు రాజా, ఆర్వీ నరిసింహారావు, తమ్మి నేని సూర్యనారాయణ, జగన్మోహన్, సురేష్, విశ్వనాధం, త్రినాథ్, అసిరప్పడు, అర్జున్, ఆదినారాయణ పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో ప్రతిభ

వేపాడ: వేపాడ మండల పరిషత్ ఉన్నత పాఠశా లలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల విద్యా ర్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ ఆర్. ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసంద ర్భంగా విజేతలను ప్రిన్సిపాల్ అభినందించారు.

దసరా ప్రాముఖ్యతపై అవగాహన

వేపాడ: దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం ఆ గ్రామంలో తిరుగుతూ ఆట పాటలతో దసరా పండగ ప్రాముఖ్యతను వివరించారు. వారితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ వినియోగించుకోండి

శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణను యువత సద్వి నియోగం చేసుకోవాలని పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు అన్నారు. మంగళవారం ఈ శిక్షణ ముగింపు సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కొనసాగించాలి

న్యూఢిల్లీ(ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి, సంప్రదా యాలను విస్తరించేందుకు సిలికాన్ ఆంధ్రలో ఏర్పాటు చేసిన తెలుగు భాషా పాఠశాల స్థాపన కార్యక్రమానికి తన ను ఆహ్వానించడంపై కలిశెట్టి అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది గొప్ప ముందడుగుగా అభిప్రాయం వ్య క్తం చేశారు. ఈ సంస్థ ద్వారా పిల్లలు వారి భాషా, సంప్ర దాయాలకు దగ్గరగా ఉంటారన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగించడం అవసరం అన్నారు.

సఖి కార్యక్రమం పై అవగాహన

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని యూత్ హాస్టల్‌లో ఆరోగ్యశాఖ, నేచర్ సంస్థ యూనిసెఫ్ సహ కారంతో కిషోరబాలికల కోసం ఉద్దేశించిన పథకం 'సఖి'పై అవగాహన సదస్సు జరిగింది.. కిషోర్ బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయొద్దు

● ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన, మానవహారం



కలెక్టరేట్ వద్ద నిరసనలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

విజయనగరం దాసన్నపేట/కలెక్టరేట్: ఉత్తరాంధ్రకు జీవనాడి అయిన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంక టేష్, డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ హెచ్చరించారు. మంగళవారం ఎస్ఎఫ్ ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు విశాఖ ఉక్కును కాపాడాలని నినా దంతో కేఎల్‌పురం నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును అమ్మడానికి చూడడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. తక్షణమే స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని, లేని పక్షంలో జరగనున్న పరిణామాలకు ఉద్యమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధు లు చినబాబు, రవికుమార్, వెంకీ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎం బాలికోన్నత పాఠశాల వద్ద నిరసన

● కరస్పాండెంట్‌తో ప్రజాసంఘాల నాయకుల వాగ్వాదం



సీబీఎం హైస్కూలు ముందు ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు

బొబ్బిలి: బొబ్బిలి సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం కర స్పాండెంట్ రత్నకుమార్, ప్రజాసంఘాలు, క్రైస్తవ భక్త సంఘం ప్రతినిధుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మంగళవారం పాఠశాల ఎదుట సీపీఐ, సీపీ ఎం, రైతుసంఘం నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, గోపాలం, లక్ష్మ నాయుడు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు కాగాన సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నిర సన తెలిపారు. ఆ సమయంలో పాఠశాల కరస్పాండెంట్ రత్నకుమార్ రావ డంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఆయనపై సీబీఎస్‌సీ సంఘం ప్రతినిధి గొంటి వేణుతో పాటు ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. 120 ఏళ్ల చరిత్ర గల పాఠశాలను అక్రమంగా అమ్మేశారని, పాఠశాలను పూర్తిగా ఇక్కడ నుంచి మూసివేసేందుకు విద్యార్థులపై ఒత్తిడి తెచ్చి, బెదిరించి టీసీలు ఇచ్చేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ సమయంలో కరస్పాండెంట్ రత్నకుమార్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించగా ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా హెచ్ఎంను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, విద్యార్థులను టీసీలిచ్చి తరిమేయాలని చూస్తున్నారని ఆరోపించారు. పాఠశాల కోసం వాలంటీర్లను, గుమస్తాను నియమించామని, ప్రస్తుత పరిస్థితిని కాకినాడ సీబీఎస్‌సీ సమావేశంలో ప్రస్తావిస్తానని, ట్రస్టు పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటే దాని బద్ధుడినని కరస్పాండెంట్ బదులివ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. ఘటనాస్థలానికి పోలీసులు వచ్చి సమీక్షించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వారినీ అక్కడ నుంచి పంపించి వేశారు.

బొబ్బిలి వీణలకు ఆదరణ

● పనస కలప కోసం ఉడ్‌బ్యాంకు ● విశాఖ లేపాక్షి మేనేజరు కార్తీక్


మాట్లాడుతున్న కార్తీక్

బొబ్బిలి: లేపాక్షికి సంబంధించి 19 అవుట్‌లెట్స్ ఉండగా వాటిల్లో బొబ్బిలి వీణలకు విశేషమైన ఆద రణ ఉందని విశాఖ లేపాక్షి మేనేజరు ఎ.కార్తీక్ తెలి పారు. మంగళవారం స్థానిక గొల్లపల్లి వీణల త యారీ కేంద్రంలో మాట్లాడారు. బొబ్బిలి వీణల మా ర్కెట్ ఏడాదికి 30 లక్షల రూపాయల మేర వ్యాపా రం జరుగుతోందన్నారు. ప్రభుత్వ, కార్పొరే ట్, ఫార్మా, ఐటీ తదితర కంపెనీల కార్యక్రమాల్లో బొబ్బిలి వీణలను గిఫ్టులుగా అందజేస్తుండడంతో గిరాకీ ఏర్ప డిందన్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా వీణల తయారు చేసి అందించలేకపోతున్నామని తెలిపారు. విశాఖ, ఢిల్లీ ఇతర నగరాల్లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో, టీటీడీ కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున అతిథులకు బొ బ్బిలి వీణలను అందజేస్తున్నారన్నారు. పాత డిజైన్లతో కూడిన వీణలకు మంచి ఆ దరణ ఉండడంతో వాటిని ప్రమోట్ చేస్తున్నట్టు తెలిపారు. మ్యూజిక్ వీణలు త యారు చేయగల నైపుణ్యం కలిగిన వారు కేవలం ఆరుగురే ఉన్నారని, మిగిలిన సుమారు 40 మంది కళాకారులు గిఫ్ట్‌వీణలను మాత్రమే తయారు చేయగలుగు తున్నారని చెప్పారు. పాతతరం వారు అంతరించిపోతే వారి కుటుంబాల్లో మరె వ్వరూ సంగీత వీణలను తయారు చేయడం లేదన్నారు. కొత్తతరం వారిని ఈ రంగంలో ప్రోత్సహించాల్సి ఉందన్నారు. కళాకారుల జీవనస్థితిగతులను మెరుగు పరిచేందుకు వారి డిమాండ్ మేరకు వీణలతయారీకి అయ్యే ఉత్పత్తి ఖర్చుకు 35 శాతం జోడించి వారికి పారితోషకాన్ని చెల్లిస్తున్నట్లు తెలిపారు. వీణల తయారీకి అవసరమైన పనస చెట్టు కలప కొరత విపరీతంగా ఉందని, ఈ సమస్యకు పరి ష్కారంగా ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు కార్తీక్ వివరించారు. స్థానిక సీడీసీ ఇన్‌చార్జి సర్వసిద్ధి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వీణల తయారీదారులకు ముగిసిన శిక్షణ

పట్టణంలోని గొల్లపల్లి వీణల తయారీ కేంద్రంలో రాష్ట్ర హస్తకళలఅభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీణల తయారీదారులకు రెండు నెలలపాటు నిర్వహించిన శిక్ష ణ కార్యక్రమం మంగళవారం ముగిసింది.ఈ సందర్భంగా విశాఖ లేపాక్షి మేనే జరు ఎ.కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పొందిన కళాకా రులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, కమిషనర్ లాలం రామలక్ష్మి, స్థానిక కేంద్రం ఇన్‌చార్జి సర్వ సిద్ధి రామకృష్ణ, వార్డు కౌన్సిలరు కాకల గోవిందమ్మ, శిక్షకులు శంకరాచారి, వాడాడకు చెందిన మురళి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన


డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న పీడీ కల్యాణచక్రవర్తి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): గజపతినగరం నియోజకవర్గ పరి ధిలోని పలు మండలాల్లో మంగళవారం చేపట్టిన పింఛన్ల పంపిణీని కలెక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ పరిశీలించారు. అదే విధంగా డీఆర్‌డీఏ కార్యాల యంలో పీడీ కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక మానిటరింగ్ సెల్ ద్వారా జిల్లాలో పింఛ న్ల పంపిణీని పర్యవేక్షించారు. 27 మండలాల్లో ఏమైనా సమస్య లు ఉంటే తక్ష ణమే వాటిని పరిష్కరించి పింఛన్ల పంపిణీని వేగవంతం చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ కార్డులపై జగన్ బొమ్మ


వైద్యులు తనకు ఇచ్చిన పుస్తకం పై జగన్ బొమ్మ చూపిస్తున్న వ్యక్తి

జామి: మండలంలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గత ప్రభుత్వాన్ని మరిచిపోవడం లేదా.. అంటూ టీడీపీ మండల నాయకుడు బాలాజీ ప్రశ్నించారు. మంగళవారం చింతాడలో 104 వైద్యశిబిరం నిర్వహించారు. అయితే ఈ శిబిరం వద్ద పంపిణీ చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్డులపై మాజీ ముఖ్యమంత్రి బొమ్మలు ఉండడంపై ఆయన మండిపడ్డారు. వెంటనే జగన్ ఉన్న పుస్తకాలు ఇవ్వడం ఆపాలన్నారు. దీనిపై అక్కడున్న వైద్యురాలు లక్ష్మిని వివరణ కోరగా 104 వైద్యసేవలకు సంబంధించి ఇంకా కొత్త పుస్తకాలు రాలేదని, వీటినే వాడాలని జిల్లా అధికారులు సూచించారని చెప్పారు.

ఫ్రీహోల్డ్ పట్టాలపై ఆరా

కలెక్టరేట్: గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన ఫ్రీహోల్డ్ పట్టాలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. అప్పట్లో మంజూరు చేసిన పట్టాలపై ఆరా తీస్తోంది. గతంలో ఇచ్చిన పట్టాలు అంతా సక్రమంగా అందించారా.. లేదా.. అనే దానిపై తహసీల్దార్లు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో వర్క్‌షాపు నిర్వహించారు. 20 ఏళ్ల కిందట వరకూ ఫ్రీహోల్డ్‌లో ఉన్న భూముల వివరాలను మండలాలు వారిగా తహసీల్దార్లు వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించారు. సబ్ రిజిస్ట్రార్ రికార్డుల్లో ఉన్న వివరాలు తహసీల్దార్ రికార్డుల్లో ఉన్న వివరాలు ఒకటే ఉన్నాయా.. లేదా.. అనేది పరిశీలించారు.

'మా గ్రామాలను అభివృద్ధి చేయండి'

శృంగవరపుకోట రూరల్: మండలంలోని దారపర్తి, మూలబొడ్డవర పంచాయతీల్లోని గిరిజన గ్రామాలను జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభి యాన్‌లో చేర్చాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కోరారు. మంగళ వారం మాట్లాడుతూ కలెక్టర్ స్పందించి తమ గిరిజన గ్రామాలు అభి వృద్ధి చెందేలా చూడాలని చేతులెత్తి మొక్కారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

అంకితభావమే ఉద్యోగులకు స్ఫూర్తిదాయకం

విజయనగరం క్రైం: పోలీసు ఉద్యోగులలు, సిబ్బందికి క్రమశిక్షణ, అంకితభావమే స్ఫూర్తిదాయకమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఏఆర్ ఎస్ఐ మహంతి వెంకటరమణకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ ఎస్ఐ మహంతి వెంకట రమణ అంకితభావంతో పనిచేసి ఇతర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీలు లీలారావు, ఆర్వీఆర్‌కె చౌదరి, ఆర్ఐలు పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

విజయనగరం దాసన్నపేట: ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని హీల్ ప్రాజెక్టు ప్రతినిధి తాలాడ దీప్తి అన్నారు. మంగళవారం చెల్లూరు ప్రాథమిక పాఠశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకుని లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటాన్ని పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

రేపటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

● సిద్ధమవుతున్న నవదుర్గ ఆలయం


నవదుర్గ అమ్మవారి ఆలయం

రాజాం రూరల్: రాజాంలోని నవదుర్గ అ మ్మవారి ఆలయంలో గురు వారం నుంచి విజయద శమి వరకూ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించను న్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించ డంతో పాటు ప్రత్యేక పూ జలు, సాంస్కృతిక కార్యక్ర మాలను ఏర్పాటు చేశారు. ఏడాదికోసారి విజయదశ మి నాడు నవదుర్గ అమ్మవారి నిజరూప దర్శనమిస్తారు. ఇందులో భాగంగా ఈనెల 12న నిజరూప దర్శనం కల్పించేందుకు అధికారులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏకైక ఆలయం

రాజాంలోని నవదుర్గ అమ్మవారి ఆలయం దేశంలోనే ఏకైక ఆలయంగా చరిత్రకెక్కింది. తొమ్మిది మంది దుర్గలు ఒకేచోట కొలువున్న దేవాలయాలు దే శంలో రెండే ఉన్నాయని చరిత్ర చెబుతోంది. దేవదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా వానపల్లి నరిసింగరావు కొనసాగుతు న్నారు. దేవస్థానం నిర్వహణ బాధ్యతలను విశ్రాంత మేనేజర్, గురుభవాని కూరాడ వెంకటరావు నిర్వర్తిస్తున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


విద్యుత్ శాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బేబీనాయన

బొబ్బిలి: నియోజకవర్గం పరిధిలో విద్యుత్, ఆరోగ్య సమస్యలను పరిష్కరించా లని ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. ఈ మేరకు సంబంధిత మంత్రులను మంగ ళవారం కలిశారు. బొబ్బిలి మండ లంలోని కొత్తపెంటలో ఇటీవల విద్యుదా ఘాతంతో కాడెద్దు మృతి చెందాయని, నష్టపోయిన ఆ రైతును ఆదుకోవాలని, బొబ్బిలి, నియోజక వర్గ పరిధిలోని పలు గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవిని కోరారు. బొబ్బిలి సీహెచ్‌సీని వందప డకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్న హామీని నెరవేర్చాలని, బాడంగి సీహెచ్‌సీ లో పనులను పూర్తి చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకు మార్ యాదవ్‌ను కోరారు.

దేవదాయశాఖ కమిషనర్‌కు వినతి


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట: నియోజకవర్గంలో ఉన్న దేవాలయాలకు దూపదీప నైవేద్యాలు సమకూ ర్చాలని, నూతన దేవాలయాల నిర్మాణం చేపట్టాలని ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. ఈ మేరకు పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని విజయవాడలో దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్‌ను మంగళవారం కలిసి అందించారు.

సురక్షిత నీరు అందించండి

పార్వతీపురం టౌన్/బెలగాం: తమకు సురక్షిత నీటిని అందించాలని జిల్లాకేంద్రవాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా నాయకులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత పాతబస్టాండ్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. 'బురద నీరు మాకొద్దు.. మంచి నీరు కావాలి.' అంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడుకి వినతిపత్రం ఇచ్చారు. ఐద్వా నాయకులు ఆర్.శ్రీదేవి , రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శిష్టు సీతారాంపురంలో ఎండీఎంపై విచారణ


విచారణ చేస్తున్న అధికారులు

రామభద్రపురం: మండలంలోని శిష్టు సీతారాంపురం ప్రాథమిక పాఠ శాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఎంపీడీవో రమామణి, ఎంఈవో తిరుమలప్రసాద్ విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజన పథకం వంటలు రుచి కరంగా శుభ్రంగా లేవని, దీంతో పిల్లలకు కడుపులో నొప్పి, వాంతులు అవుతున్నా యని నిర్వాహకులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తక్షణమే నిర్వా హకులను తొలగించకపోతే తమ పిల్లలకు టీసీలు ఇచ్చి పంపించాలని డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు నిర్వాహకులకు నోటీసులిచ్చి రెండు నెలల తరు వాత అప్పటికీ వారి పనితీరు మారకపోతే డ్వాక్రా సంఘాల గ్రూపులకు అప్పగి స్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో పాఠశాల కమిటీ చైర్మన్ తుట్టా అప్పారావు నేతృత్వంలో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం చెడిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. 20 రోజుల కిందట తాము ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు అధికారులు ఎందుకు ప ట్టించుకోలేదని సర్పంచ్ కర్రోతు వెంకన్న నిలదీశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని ఎంఈవో తిరుమలప్రసాద్ వారిని శాంతింపజేశారు. జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు, మాజీ సర్పంచ్ శిష్టు రవణ, ఉప సర్పంచ్ కర్రోతు అప్పారావు పాల్గొన్నారు. ఈనెల 14వ తేదీన తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

లైంగికదాడి కేసులో 22 ఏళ్ల జైలు

బొబ్బిలి: పాత బొబ్బిలి ప్రసాద్ నగర్ కాలనీకి చెందిన డొంకా రమేష్‌కు లైంగిక దాడి కేసులో 22 సంవత్సరాల కారాగార శిక్ష, రెండువేల రూపాయల జరి మానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. సీఐ కటకం సతీష్‌కుమార్ కథనం మేరకు.. 2020 మార్చి ఒకటో తేదీన ఓ గ్రామంలోని ఓ ఇంట్లోకి డొంకా రమేష్ మద్యం మత్తులో చొరబడి వివాహితపై లైంగికదాడికి పాల్పడినట్లు ఫిర్యాదు రావ డంతో అప్పటి సీఐ ఈ.కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూ షన్ ఆరోపణలు కోర్టులో రుజువు కావడంతో ముద్దాయికి విజయనగరం ఐదో ఏడీజే కమ్ ఉమెన్‌కోర్టు న్యాయాధికారి ఎస్.పద్మావతి మంగళవారం జైలు శిక్ష, జరిమానా విధించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎం.రవీంద్రనాథ్ వ్యవహరించారు. కేసులో సేవలందించిన హెచ్‌సీ సీహెచ్ స్వామినాయుడును సీఐ సతీష్‌కుమార్ అభినందించారు.

విద్యుదాఘాతంతో గీత కార్మికుడి మృతి

బొబ్బిలి రూరల్: మండలంలోని కొండదేవుపల్లిలో మంగళవారం గీత కార్మి కుడు రాగోలు కృష్ణ (50) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రాగోలు కృష్ణ సాయంత్రం పామాయిల్ తోటలో గెలలు కోయడానికి భుజంపై ఇనుప బొరిగి పెట్టుకొని వెళ్తున్నాడు. పంట పొలంలో గల గట్టుపై వేలాడుతున్న విద్యుత్ తీగలు ఆయన భుజంపై ఉన్న ఇనుప బొరిగికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తె లుసుకున్న గ్రామస్థులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ యనకు భార్య రాగోలు లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు సింహాచలం, కుమారి ఉన్నారు.

పాము కాటుతో ఒకరు..

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామానికి చెందిన యడ్ల సూర్యం(60) మంగళవారం పాముకాటుకు గురై మృతిచెందినట్లు పీహెచ్‌సీ వైద్యుడు అనీల్‌కుమార్ తెలిపారు. సూర్యం తాను నివసిస్తున్న రేకు ఇంట్లో నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున రేకుపై నుంచి పాము మంచంపై పడి కాటువేసినట్లు తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం ఎల్.కోట పీహెచ్‌సీ అక్కడ నుంచి ఎస్.కోట సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. ఎస్.కోటలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందినట్లు పేర్కొన్నారు.

జ్వరంతో కేజీబీవీ విద్యార్థిని..

కొమరాడ: కొమరాడ కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కె.శారద(14) జ్వరంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. జాకూరుకు చెందిన శారదకు గత నెల 18 నుంచి జ్వరంతో బాధపడుతోంది. స్థానికంగా ఉన్న పీహెచ్‌సీలో వారం రోజుల పాటు చికిత్స పొందింది. అయినా పరిస్థితి మెరుగవ్వలేదు. దీంతో కేజీబీవీ సిబ్బంది ఆ బాలికను గత నెల 23న జి ల్లా కేంద్రాసుపత్రికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో సెప్టెంబ రు 26న విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూతో బాధపడుతున్న ఆ బాలికకు ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సకాలంలో వైద్యసేవలు అంది ఉంటే తమ కూమార్తె బతికేదని తల్లిదండ్రులు నర్సింహులు, దానమ్మ తెలిపారు.

గంజాయి స్వాధీనం

జామి: అలమండ రైల్వేస్టేషన్‌వద్ద గంజాయి విక్రయానికి వచ్చిన ముగ్గురు యువకులను పోలీసులు సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఈ విషయంపై సీఐ రవికుమార్ మాట్లాడుతూ విజయనగరానికి చెందిన ఇద్దరు యువకులు, విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన ఒక యువ కుడు ట్రైన్‌లో ఒడిసా నుంచి అలమండ స్టేషన్‌కు గంజాయి తీసుకువస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే చేరుకున్నామని, అక్కడ విక్రయించడానికి సిద్ధమవుతున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఇద్దరిపై దాడి

మక్కువ: మండలంలోని చెముడు గ్రామానికి చెందిన గొట్టాపు మనోహర్ రావు, అతని సోదరుడు కృష్ణమూర్తిని ఓ మహిళతో పాటు ఆరుగురు వ్యక్తులు విశాఖపట్నం నుంచి రెండు కార్లలో వచ్చి కర్రలతో దాడి చేసి గాయపరిచారని ఎస్ఐ ఎం.వెంకట రమణ తెలిపారు. మనోహర్‌రావు ఇంటిలోనే అతని మీద దాడి చేసి గాయపరిచారని, ఈ క్రమంలో అడ్డుకున్న మనోహర్‌రావు సోదరుడినీ గాయపరిచారని చెప్పారు. ఇంట్లో సామగ్రిని కూడా ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఈ ఘటనపై మనోహర్‌రావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

సుజయ్ ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు

రామభద్రపురం: రామభద్రపురంలో టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి సుజ య్‌కృష్ణరంగారావుకు సంబంధించిన ఫ్లెక్సీలను చించివేయడంపై రొంపల్లి ఎంపీ టీసీ సభ్యుడు భవిరెడ్డి శంకరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సుజ య్‌కృష్ణరంగారావు జన్మదినం పురస్కరించుకుని కటౌట్లు ఏర్పాటు చేశారు. అయితే కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీలను అడ్డంగా చించి వేయ డంపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.ఈ నేపథ్యంలో పోలీసులు దర్యా ప్తుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

సాఫ్ట్ బాల్ పోటీలకు పారాది విద్యార్థుల ఎంపిక

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బెల్లాన సుప్రియ, అల్లాడ తేజస్విని, పి.చైతన్య కుమారి సాఫ్ట్‌బాల్ జూనియర్ జాతీయ క్రీడాపోటీలకు ఎంపికయ్యారు.ఈ మేరకు కర్నూలులో ఈనెల ఏడో తేదీ నుంచి జరిగే పోటీల్లో పాల్గొంటారని పీడీ నల్ల వెంకటనాయుడు తెలిపారు. ఈ మేరకు హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే ఇటీవల బాడంగి మండలంలో జరిగిన అంతర్ జిల్లాల బేస్‌బాల్ పోటీల్లో పారాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నానిబాబు, మణికంఠ, మన్విత, అవంతిక, గణేష్ నవంబరులో జరగబోయే రాష్ట్ర స్థాయి అండర్-19 విభాగంలో పాల్గొనేందుకు ఎంపికయ్యారని పీడీ తెలిపారు. ఈ మేరకు హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడాభివృద్ధికి ప్రాధాన్యం

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పేర్కొన్నారు. మంగళవారం ఉద యం పట్టణ శివారు విజ్జీ మైదానానికి విచ్చేసిన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రభుత్వం నుంచి మంజూరైన 30 హాకీ స్టిక్‌లను క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో కోచ్‌లు, టీడీపీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ ఎంపికలు

విజయనగరం టౌన్: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్- 14, అండర్- 17 బాల బాలికల స్విమ్మింగ్ జట్ల ఎంపిక మంగళవారం నిర్వహించారు. విజయ నగరం ప్రభుత్వ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మ డి జిల్లా పరిధిలోని విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడా కారులను జిల్లా జట్లకు ఎంపిక చేశామని, ఎంపికైన జట్లు జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని స్కూల్ గేమ్స్ కార్యదర్శి తెలిపారు.

సైన్స్ టాలెంట్ పరీక్షకు ఎంపిక

కొత్తవలస: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహించిన సైన్స్ టాలెంట్(చెకుముకి) పరీక్షలో ఓపీ జిందాల్ విద్యామందిర్ పాఠశాల ప్రథ మ స్థానం కైవసం చేసుకుని జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు ఈ వే దిక కన్వీనర్ సత్యారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులకు త్వరలో కొత్త పింఛన్లు

- గిరిజనులకు పోడుపట్టాలు మంజూరు
- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

మెంటాడ: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలో పింఛన్లు మంజూరవుతాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఒకటో తేదీ సెలవైతే ముందుగానే పింఛను అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో సెలవుల తరువాత తీరుబడిగా అందించే వారని గుర్తు చేశారు. ఆండ్ర, లోతుగెడ్డ గ్రామాల్లో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల లోపు అనేక హామీలను నెరవేర్చామని చెప్పారు. దశల వారీగా మిగిలినవి అమలు చేస్తామని సంధ్యారాణి తెలిపారు. కొందరు లబ్ధిదారులకు మంత్రి స్వయంగా పింఛన్లు అందజేశారు. పోడు భూముల సాగుదారులకు త్వరలో పట్టాలు అందజేస్తామని ప్రకటించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాను ఆండ్ర జలాశయంలో చేప పిల్లలు విడుదల చేయడం వల్ల ఎందరో నిర్వాసితులు లాభపడ్డారని, మళ్లీ చేపపిల్లలు విడిచిపెట్టి నిర్వాసితులను, గిరిజనులను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ప్రతి పేదవానికి మూడు సెంట్ల భూమి, ఇంటి నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు మంజూరు చేస్తామని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీటీసీలు, సర్పంచులను పార్టీలకు అతీతంగా ఆహ్వానించాలని... లేదంటే ఉపేక్షించేది లేదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చలుమూరి వెంకట్రావు, గెద్ద అన్నవరం, అప్పలనరసమ్మ, సూరెడ్డి కృష్ణమూర్తి, కొండ్రోతు శ్రీనివాసరావు, గంగులు, రెడ్డి ఆదినారాయణ, రెడ్డి ఎర్నాయుడు, ఎస్.గురునాయుడు, హరి ఈశ్వరరావు, ఎంపీడీఓ త్రివిక్రమరావు పాల్గొన్నారు.


మెంటాడ: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి


చీపురుపల్లి: పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

చీపురుపల్లి: అన్ని వర్గాల ప్రజలను సంతోషంగా ఉంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. చీపురుపల్లిలోని జి.అగ్రహారం, ఆకులపేటలో మంగళవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వమని, ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీ నాటికే అర్హులందరికీ పింఛన్లు అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వం పింఛనుదారులకు భరోసా కల్పించలేకపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, కూటమి నాయకులు గద్దే బాబూరావు, కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, విసినిగిరి శ్రీనివాసరావు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం

విజయనగరం రూరల్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మంగళవారం పాల్గొన్నారు. దాసన్నపేట, నవాబుపేట, కేఎల్‌పురంలోని మొండివీధి, మండల పరిధిలోని పడాలపేట కార్యక్రమంలో అదితి గజపతిరాజు పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌దారులతో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మొత్తాన్ని పెంచారన్నారు. రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నారన్నారు. కమిషనర్ నల్లనయ్య, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బంగారుబాబు, గంటా రవి, నాగరాజు పాల్గొన్నారు.

గరివిడి (మెరకముడిదాం): మెరకముడిదాం మండలంలోని గొల్లలవలస, రాచపేట, పూతికవలస, యాడిక గ్రామాలలో మంగళవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రాంమల్లిక్ నాయుడు, టీడీపీ నాయకులు కోట్ల మోతీలాల్ నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, కె.ధనుంజయ్, చల్లా శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.


భోగాపురం: లింగాలవలసలో పింఛను అందజేస్తున్న మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు


విజయనగరం: పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు


గరివిడి:పింఛన్లు పంపిణీ చేస్తున్న రాంమల్లిక్ నాయుడు

ఒక్కరోజులోనే అధిక శాతం పింఛన్ల పంపిణీ

గజపతినగరం: జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమం మంగళవారం వేకువ జాము నుంచే చేపట్టినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. మంగళవారం పురిటిపెంట గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దివ్యాంగురాలు పోలంకి కృష్ణకుమారి, కాసర రాధ అనే వృద్ధురాలికి పింఛన్ల పంపిణీనికి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులకు పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం వారి నుంచి ఎకనాలెడ్జ్‌మెంట్ ను తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో అక్టోబర్‌కు సంబంధించి 2లక్షల 78వేల 240మంది పింఛనుదారులకు గాను మధ్యాహ్నం రెండు గంటలకే 2లక్షల 70వేల 130 మందికి అందజేసినట్టు తెలిపారు. ఒక్కరోజులోనే 97.09 శాతం పంపిణీ చేసినట్టు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కిషోర్‌కుమార్, తహసీల్దార్ రత్నకుమార్ పాల్గొన్నారు.

బొండపల్లి: అంబటివలసలో ఎన్టీఆర్ భరోసా పింఛను మొత్తం పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ మంగళవారం పరిశీలించారు. పింఛ4నులు సక్రమంగా పంపిణీ చేయాలని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన ఆదేశించారు. సాంకేతిక లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.


పురిటిపెంటలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

ఎరువుల సమస్యను పరిష్కరించాలి

గంట్యాడ: ప్రస్తుతం ఎరువుల సమస్య అధికంగా ఉందని... దీనిని పరిష్కరించి ప్రతి రైతుకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటకు ప్రధానంగా యూరియా, పొటాష్ చాలా అవసరమని ... రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్లు వద్ద లేవని సభ్యులు తెలిపారు. వెంటనే అందేలా చూడాలని అధికారులను కోరారు. సచివాలయ పరిధిలో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు విధి నిర్వహణలో అలసత్వంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీధి దీపాలు వేయడం లేదని పలువురు సర్పంచులు చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు వర్రి నర్సింహమూర్తి, ఎంపీడీవో భవాని, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మహాసభలకు ఆహ్వానం

నెల్లిమర్ల: విజయనగరంలో ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరుగనున్న ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు, రాష్ట్ర విద్యావైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మడక బలరాంనాయుడు కోరారు. నెల్లిమర్లలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బందిని ఉద్దేశించి మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి వెంకటనాయుడు, దత్తిరాజేరు మండల కమిటీ ప్రధాన కార్యదర్శి బుడితి రవికుమార్, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు

రొంపల్లిలో డెంగ్యూ లక్షణాలు

రామభద్రపురం: మండలంలోని రొంపల్లిలో డెంగ్యూ వ్యాధి లక్షణా లతో భవిరెడ్డి బంగారమ్మ అస్వస్థతకు గురయ్యారని రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్ తెలిపారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన నేపథ్యంలో ఆమెను విజయనగరం మహరాజా ఆసుపత్రికి తరలించారు. దీంతో దిలీప్‌కుమార్ గ్రామంలో పారిశుధ్య కార్యక్ర మాలు, ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు.

వైసీపీ నుంచి జనసేనలోకి...

డెంకాడ (భోగాపురం): మండలంలోని పలువురు వైసీపీ నాయకులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, వార్డు మెంబరు సిరికి అప్పారావు ఎమ్మెల్యే లోకం నాగమాధవి సమక్షంలో భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సిరికి అప్పారావు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో పల్లెల అభివృద్ధికి తోడ్పడాలనే ఆలోచనలో పార్టీలో చేరినట్టు తెలిపారు. ఆయనతో పాటు వివిధ పంచాయితీల సర్పంచ్‌లు, నాయకులు జనసేనలో చేరారు.


జనసేనలో చేరిన వారితో ఎమ్మెల్యే నాగమాధవి

వీఆర్వోల బదిలీలు

లక్కవరపుకోట: మండలంలో వివిధ రెవెన్యూ గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వోలను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిని బుధవారం రిలీవ్ చేయనున్నట్టు తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. గ్రేడ్-1 వీఆర్వోలుగా ఉన్న కల్లేపల్లి వీఆర్వో మోహన్‌ను లచ్చంపేట, ఎల్‌కేఎస్‌పురం వీఆర్వో పూరియమను మల్లివీడు, రంగాపురం వీఆర్వో రామును మర్లాపల్లి, సన్యాసిని గంగుబూడి, ఈశ్వరరావును ఎల్‌కేఎస్.పురం, గణేశ్వరరావును ఎల్.కోట, వీర్రాజను వేపాడ, దేవిని ఎస్.కోట, రాధాకృష్ణను కొత్తవలస, శ్రీరాములను మెరకముడిదాం బదిలీచేశారు. గ్రేడ్-2 వీఆర్వోలుగా ఉన్న కుమార్‌ను చీపురుపల్లి, మహేంద్రను సతివాడ, గోవిందను వల్లూరు, సౌజన్యను కిత్తన్నపేట, పవన్‌ను గొల్లాం, చంద్రికను జేడీ.పేట, గనేసమ్మను ఆర్టీపేట బదిలీ చేశారు.

ప్రశస్థ యాప్ స్క్రీనింగ్‌పై అవగాహన

గజపతినగరం: గ్రామ స్థాయిలో దివ్యాంగ పిల్లలను గుర్తించేవిధంగా ప్రశస్థ యాప్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పించనున్నట్టు అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ ఎస్.కల్పన తెలిపారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం అందజేసిన పరికరాలను ఏవిధంగా సద్వినియోగం చేసుకుంటున్నదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ ప్రశస్థ యాప్ అందుబాటులోకి వచ్చిన తరువాత 126 మంది పిల్లలను గుర్తించినట్టు తెలిపారు. యాప్ ద్వారా గ్రామాల్లో ఉన్న దివ్యాంగ పిల్లలను అతి దగ్గరలో ఉన్న పాఠశాలలకు పంపించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల్లో ఎటువంటి లోపాలు ఉన్నా ఈ యాప్ ద్వారా గుర్తిస్తామని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఈఐ కోఆర్డినేటర్ ఎం.భారతి, ఎంఆర్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్‌ను కలిసిన బంగార్రాజు

డెంకాడ /భోగాపురం: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నెల్లిమర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు వివిధ అంశాలపై చర్చించినట్లు కర్రోతు బంగార్రాజు తెలిపారు. ఆయనతో పాటు విజయనగరం పార్లమెంట్ సెక్రటరీ కర్రోతు రాజు, పడుగు తోటరావు తదితరులు ఉన్నారు.

ఉచిత ఇసుక విధానంపై స్పష్టతనివ్వాలి



ర్యాలీలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

చీపురుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పట్టణంలోని మెయిన్ రోడ్డులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు గవిడి శంకరరావు, రేగిడి అప్పలనాయుడు, బెల్లాన సత్యం, సప్ప లక్ష్మునాయుడు తదితరులు మాట్లాడారు. ఇసుక పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం సరళీకృతం చేసిందని... కానీ మూడు నెలలుగా ఇసుక లభ్యత లేదన్నారు. దీనిపై ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వీరికి మద్దతుగా వైసీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, గవిడి సురేష్, ప్రభాత్, కర్రోతు ప్రసాద్, కర్ణపు ఆది, ముల్లు పైడిరాజు, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ ఎంపీడీవో బదిలీ

గంట్యాడ: స్థానిక ఎంపీడీవో వై.భవాని డెంకాడకు బదిలీపై వెళుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలం ఎంపీడీవోగా పనిచేస్తున్న రమణమూర్తిని ఇక్కడ ఎంపీడీవోగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

నెల్లిమర్ల: స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను స్థానిక కార్యాలయం వద్ద మంగళవారం చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ కె.అప్పలరాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేనేజర్ ఎం.వి.రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, నగర పంచాయితీ సిబ్బంది, శానిటేషన్ కార్యద ర్శులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

మెంటాడ: మద్యం దుకాణం నుంచి లోతుగెడ్డ పంచాయతీ కొండపర్తి గ్రామానికి మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని సంతతోట వద్ద ఆండ్ర ఎస్.ఐ. కె.సీతారాం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

భోగాపురం/డెంకాడ: భోగాపురం మండలం తూడెం ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వి.అప్పన్న తెలిపారు. ఇటీవల అనంతపురం జిల్లాలోని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఎంపికలు జరిగాయని తెలిపారు. ఆర్.సాత్విక్, డి.దుర్గాదేవి, యు.లోకేశ్వరి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు శ్రీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను దివీస్ యాజమాన్యంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ సత్యనారాయణ తదితరులు అభినందించారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

రెజ్లింగ్ పోటీలకు కొండవెలగాడ విద్యార్థులు

నెల్లిమర్ల: మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పతివాడ శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో ఈ నెల 3 నుంచి మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగనున్నాయని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వి.జ్ఞానశంకర్ తదితరులు అభినందించారు.


విజేతలతో ఉపాధ్యాయులు

క్రీడలపై శ్రద్ధ చూపండి

మెంటాడ: యువత క్రీడలను మక్కువ కనబరచాలని గజపతినగరం సీఐ జి.ఎ.వి.రమణ అన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు చక్కటి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. లోతుగెడ్డ పంచాయతీలో గిరిజన యువకులకు వాలీ బాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.ఐ.రమణ, టీడీపీ శ్రేణులు వెంకట్రావు, అన్నవరం, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కిట్లు పంపిణీ చేస్తున్న సి.ఐ.రమణ

విద్యార్థులకు బహుమతి ప్రదానం

గరివిడి: స్థానిక ఎంఆర్ సీ భవనంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో కొండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరికి ఎంఈఓ పి.రామారావు, యూటీఎఫ్ నాయకులు ఎ.సత్య శ్రీనివాస్ ప్రశంసాపత్రాలను, బహుమతులను అందించారు.


బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గరివిడి: మద్యం, ధూమపానం, డ్రగ్స్ వంటి దురలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు హితవు పలికారు. స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజ్‌లో మంగళవారం ప్రిన్స్‌పాల్ వి.జాషువా జయప్రసాద్ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ రాఘవులు మాట్లాడుతూ దురవాలట్ల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. చాలా మంది విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లి..జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శంకరరావు, ఎస్ఐ బి.లోకేశ్వరరావు, ఏఓ జి.అనీల్ కుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ డి.వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

రక్తదానంపై అవగాహన

చీపురుపల్లి: రక్తదానంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ యువతకు అవగాహన కల్పించారు. ఆరునెలలకొకసారి ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలన్నారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్న వారిని కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.